ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల
జిల్లా వార్తలు
శనివారం 10 మే 2025



వానాకాలం 'సాగు' ఖరారు..

జిల్లాలో ఖరీఫ్ సాగు లెక్కలు

మండలం	వరి	పత్తి	ఇతర	మొత్తం
గంభీరావుపేట	18600	200	530	19330
ఇల్లంతకుంట	24000	12500	1970	38470
ముస్తాబాద్	23000	600	1650	25250
సిరిసిల్ల	4900	850	103	5853
తంగళ్లపల్లి	19950	1000	1081	22031
వీర్నపల్లి	8360	400	32	8792
ఎల్లారెడ్డిపేట	17500	3600	30	21130
బోయినపల్లి	13000	7000	1310	21310
చందుర్తి	15200	6200	210	21610
కోనరావుపేట	18200	4800	700	23700
రుద్రంగి	5900	3400	805	10105
వేములవాడ	5200	5010	368	10578
వేములవాడ రూరల్	11050	4200	364	15614
మొత్తం	184860	49760	9153	243773

- జిల్లాలో పంటల యాక్షన్ ప్లాన్ సిద్ధం
- పంటల రుణపరిమితి పెంపు నామమాత్రమే

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

యాసంగి ధాన్యం విక్రయించడం.. వరి కోతలపై దృష్టి సారిస్తూనే వానాకాలం సీజన్ పంటల సాగుకు రైతులు సిద్ధమవుతున్నారు. కోతలు పూర్తయిన భూముల్లో దుక్కులు దున్నుకుంటున్నారు. సమృద్ధిగా ఈసారి వర్షాలు కురుస్తాయని ఖరీఫ్ సాగుపై ఆశలు పెంచుకున్నారు. దీనికి అనుగుణంగానే ఖరీఫ్‌కు సంబంధించి రాజన్న సిరిసిల్ల జిల్లాలో వ్యవసాయ శాఖ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసింది. రైతులకు అవసరమయ్యే విత్తనాలు, ఎరువులను అందుబాటులో ఉంచే విధంగా చర్యలు చేపట్టారు.

వానాకాలం సాగు 2.43 లక్షల ఎకరాలు

రాజన్న సిరిసిల్ల జిల్లాలో వానాకాలంలో 2 లక్షల 43 వేల 783 ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేస్తారని వ్యవసాయ శాఖ అంచనాలు వేసింది. ఇందులో వరి లక్షా84వేల 860 ఎకరాలు, పత్తి 49,760 ఎకరాలు, పెసర 79 ఎకరాలు, కందులు 1,155 ఎకరాలు, జొన్నలు 14, మొక్కజొన్న 1,600 ఎకరాలు, ఇతర పంటలు 6,304 ఎకరాల్లో సాగు చేస్తారని అంచనాలు వేశారు. ఇందుకోసం వరి 56,568 క్వింటాళ్ల విత్తనాలు, అవసరం అవుతాయని అంచనాలు వేయగా కందులు 122.5 క్వింటాళ్లు, మొక్కజొన్న 27.04 క్వింటాళ్లు, పత్తి 1,28,650 ప్యాకెట్లు, పెసర్లు 4.08 క్వింటాళ్లు అవసరం అవుతాయని అంచనాలు వేశారు.

● 56,060 మెట్రిక్ టన్నుల ఎరువులు

వానాకాలం 2.43 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగు కానుండగా, ఎరువులు 56,060 మెట్రిక్ టన్నులు అవసరం అవుతాయని అంచనాలు వేశారు. యూరియా 25,370 మెట్రిక్ టన్నులు, డీఏపీ 3,460 మెట్రిక్ టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు 22,390 మెట్రిక్ టన్నులు, ఎంఓపీ 4,115 మెట్రిక్ టన్నులు, ఎస్ఎస్‌పీ 725 మెట్రిక్ టన్నులు అవసరం అవుతాయని అంచనాలు వేశారు.

● 122 పంటలకు స్వల్పంగా రుణ పరిమితి పెంపు

వానాకాలం సీజన్ ప్రారంభానికి ముందే పంట రుణాల పరిమితి(స్కేల్ ఆఫ్ ఫైనాన్స్) ప్రణాళికను ఖరారు చేశారు. రాష్ట్రస్థాయి సాంకేతిక కమిటీ నిర్ణయం మేరకు 2025-26 వానాకాలం, యాసంగి సీజన్‌లకు సంబంధించిన 122 పంటలకు సంబంధించి రుణ పరిమితిని పెంచారు. గతేడాదితో పోలిస్తే రాజన్న సిరిసిల్ల జిల్లాలో సాగుచేసే ప్రధాన పంటల్లో కొన్ని పంటలకు మాత్రమే స్వల్పంగా పరిమితి పెరిగింది. జిల్లాలో ప్రధానంగా వరిసాగు ఎక్కువగా ఉంటుంది. ఈసారి వరి, కంది, మొక్కజొన్న, మినుములు, పెసర, శెనగ, జొన్న తదితర పంటలకు రుణ పరిమితి పెంచలేదు. పత్తి సాగుకు రూ.2వేలు మాత్రమే పెంచారు. గతేడాది రూ 46 వేల వరకు ఉండగా ఈసారి రూ 48 వేలకు పెరిగింది. పాడి రైతులకు డెయిరీ పెట్టుకోవడానికి ఆవుకు, గేదెకు రూ.33 వేల నుంచి రూ.35 వేల వరకు రుణం ఇవ్వాలని సూచించారు. గొర్రెలు, మేకలు కొనుగోలుకు సంబంధించి రూ.29 వేలు, ఒక్కో కోడిపిల్లకు రూ 200 నుంచి రూ 210 చొప్పున, చేపలు

మిగతా 8లో

లైసెన్స్ సర్వేయర్ల శిక్షణకు దరఖాస్తులు చేసుకోవాలి

- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

సిరిసిల్ల కలెక్టరేట్, మే 9 (ఆంధ్రజ్యోతి): లైసెన్స్ సర్వేయర్‌లకు శిక్షణ కోసం ఈనెల 17లోగా దరఖాస్తులు చేసుకోవాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణ కోసం అర్హత గల అభ్యర్థుల నుంచి తెలంగాణ అకాడమీ ఆఫ్ ల్యాండ్ ఇన్‌ఫర్మేషన్ అండ్ మేనేజ్‌మెంట్ దరఖాస్తులను ఆహ్వానిస్తుందని తెలిపారు. మే 5 నుంచి మీ సేవా కేంద్రాల్లో వంద రూపాయలు చెల్లించి దరఖాస్తు ఫారం పొందవచ్చునని, ఆ ఫారాన్ని 17వ తేదీలోగా మీ సేవ కేంద్రాల్లో అందించాలని కలెక్టర్ తెలిపారు. అలాగే ఇంటర్ గణితంలో 60 శాతం మార్కులు సాధించిన వారు, ఐటీఐ డ్రాఫ్ట్‌మెన్, డిప్లొమా, బీటెక్(సివిల్)లో సమానమైన అర్హతగల వారు అర్హులని వెల్లడించారు. ఎంపికైన అభ్యర్థులకు 50 రోజుల పాటు ఈనెల 26 నుంచి జూలై 26 వరకు శిక్షణ ఇస్తామని, దీనికోసం ఓసీ అభ్యర్థులు రూ.5 వేలు, ఎస్సీ ఎస్టీ అభ్యర్థులు రూ.2500 ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. వివరాలకు 9849081489, 7032634404 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని కలెక్టర్ కోరారు.

మద్యం సేవించి వాహనం నడిపితే కఠిన చర్యలు

- వేములవాడ పట్టణ సీఐ వీరప్రసాద్



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న పట్టణ సీఐ వీరప్రసాద్

వేములవాడ, మే 9 (ఆంధ్రజ్యోతి) : మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని వేములవాడ పట్టణ సీఐ వీరప్రసాద్ అన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపి పట్టుబడిన సుమారు 100 మందికి శుక్రవారం వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఆయన కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న వారి వల్లనే ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ప్రమాదాలు జరిగినప్పుడు కుటుంబ యజమానికి జరిగే నష్టం ఆ కుటుంబానికి ఆవేదన కలిగిస్తుందని గుర్తుంచుకోవాలన్నారు. ప్రమాదాలతో ప్రాణాలు పోయే ప్రమాదం ఉన్నందున మద్యం సేవించి వాహనాలు నడపరాదని వారితో ప్రమాణం చేయించారు. పదేపదే మద్యం సేవించి పట్టుబడితే జైలు శిక్ష కూడా విధించడం జరుగుతుందని వివరించారు. కౌన్సెలింగ్ నిర్వహించిన అనంతరం వారిని కోర్టులో హాజరుపరుస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ రాజు పాల్గొన్నారు.

ఘనంగా పోచమ్మ తల్లి బోనాలు



ఇల్లంతకుంటలో బోనాలు తీస్తున్న మహిళలు

ఇల్లంతకుంట, మే 9 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో పోచమ్మతల్లి బోనాలు ఘనంగా నిర్వహించారు. ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో పెద్దమ్మతల్లి ఉత్సవాలలో భాగంగా శుక్రవారం డప్పుచప్పుళ్లు, శివసత్తుల పూనకాల మధ్య మహిళలు బోనాలు ఎత్తుకొని ఆలయానికి చేరుకున్నారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో శనివారం గణపతిహోమం, పెద్దమ్మతల్లి, పెద్దిరాజుల కల్యాణోత్సవం, పెద్దమ్మతల్లి బోనాలు ఉంటాయని ముదిరాజ్ సంఘ నాయకులు తెలిపారు. అన్ని గ్రామాల ప్రజలు ఉత్సవాల్లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఆపరేషన్ సిందూర్ దిగ్విజయం కావాలని పూజలు



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

వేములవాడ కల్చరల్, మే 9 (ఆంధ్రజ్యోతి): భారత్ ఆర్మీ పాకిస్థాన్‌పై ఆపరేషన్ సిందూర్ దిగ్విజయం కావాలని రాజన్న ఆలయ అర్చకులు శుక్రవారం పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ అర్చకులు తెలంగాణ ప్రభుత్వ దేవాదాయ ధర్మాదాయ శాఖ సూచనల మేరకు రాజన్న ఆలయంలో శ్రీలక్ష్మీగణపతి, శ్రీపార్వతి సమేత రాజరాజేశ్వర స్వామివార్లు పూజలు నిర్వహించారు.

తల్లి పోషణపై యువకుడికి కౌన్సెలింగ్



కౌన్సెలింగ్ ఇస్తున్న సాంఘీక సంక్షేమ శాఖ అధికారి

సిరిసిల్ల క్రైం, మే 9 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం సమీపంలో నివసించే కల్లెపల్లి లచ్చవ్వ అనారోగ్య సమస్యలతో బాధపడుతూ జీవనం సాగిస్తోంది. అయితే తల్లి బాగోగులు కొడుకు చూసుకోవడం లేదని ఆమె సీనియర్ సిటిజన్స్‌ను ఆశ్రయించింది. ఈ సమస్యను సీనియర్ సిటిజన్స్ ప్రతినిధులు సాంఘీక సంక్షేమ శాఖ అధికారులు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో శుక్రవారం సాంఘీక సంక్షేమ శాఖ ప్రతినిధి దేవిక వెంటనే స్పందించి లచ్చవ్వ కుమారుడు సురేష్‌ను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చింది. ఈ కౌన్సిలింగ్ ద్వారా తల్లి లచ్చవ్వను పోషించేందుకు సురేష్ అంగీకరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ అల్ సీనియర్ సిటిజన్స్ అధ్యక్షుడు చేపూరి బుచ్చయ్య, ప్రధాన కార్యదర్శి డాక్టర్ జనపాల శంకరయ్య, ఉపాధ్యక్షుడు ఎనుగుల ఎల్లయ్య, క్యాషియర్ దేవదాస్‌లు పాల్గొన్నారు.

బాబు జగ్జీవన్ రామ్ వ్యవసాయ కళాశాల వార్షికోత్సవం

- ఆటపాటలతో విద్యార్థుల సందడి



విద్యార్థులకు మెమొంటో అందిస్తున్న అధ్యాపకులు

తంగళ్లపల్లి, మే 9 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల గ్రామంలోని బాబు జగ్జీవన్ రామ్ వ్యవసాయ కళాశాల వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్‌బేగం, రామయ్యపేట రైతు ఉత్పత్తిదారుల సంస్థ చైర్మన్ శ్రీదేవ్‌రావు, సైనోవిట ఫార్మర్ సొల్యూషన్ మేనేజింగ్ డైరెక్టర్ గౌతమ్‌రెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు దేశాన్ని పోషిస్తున్నారన్నారు. విద్యార్థులు గురువులను గౌరవిస్తూ, మానసిక దృఢత్వంతో ముందుకు సాగాలని సూచించారు. రైతులు ఐక్యంగా ఉండి అభివృద్ధి సాధించాలని అన్నారు. కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ కె.బి సునీతా దేవి కళాశాల విజయాలు, రాబోయే రోజుల్లో చేయవలసిన ప్రణాళికలు తదితర అంశాలను వివరించారు. అలాగే కళాశాల మ్యాగజైన్ ఆవిష్కరించారు. కళాశాల దత్తత గ్రామం రాళ్లపేట ఆదర్శ రైతులను సన్మానించారు. అనంతరం వివిధ ఆటల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. విద్యార్థులు ఆటపాటతో సందడి చేశారు. ఈ కార్యక్రమానికి స్వాగత ఉపన్యాసం డాక్టర్ భవ్యశ్రీ ఇవ్వగా, కళాశాల ఓఐఎస్ఏ డాక్టర్ రమేష్ కార్యక్రమానికి హాజరైన వారికి ధన్యవాదాలు తెలిపారు.

నిర్మించారు.. నిర్లక్ష్యంగా వదిలేశారు..

- అద్దె భవనంలో కొనసాగుతున్న పల్లె దవాఖాన - పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



వల్లంపట్ల గ్రామంలో నిర్మించిన పల్లె దవాఖాన

ఇల్లంతకుంట, మే 9 (ఆంధ్రజ్యోతి) గ్రామీణ ప్రాంతాలలోని ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఆరోగ్య ఉపకేంద్రాల స్థానంలో పల్లె దవాఖానలను ఏర్పాటు చేసింది. అందులో భాగంగా వల్లంపట్ల గ్రామంలో రూ 20లక్షలతో పల్లె దవాఖాన నిర్మాణం చేపట్టింది. ఈపల్లె దవాఖాల పరిధిలో వల్లంపట్ల గ్రామంతో పాటు కిష్టరావుపల్లె, ఒగులాపూర్, గూడెపుపల్లి గ్రామాలు రానున్నాయి. కొన్ని అవంతరాల మధ్య భవన నిర్మాణ పనులు పూర్తి అయ్యాయి. అద్దె భవనంలో కొనసాగిన ఆసుపత్రికి నూతన భవనంలోకి మారుతే మెరుగైన వైద్యసేవలు అందుతాయని ప్రజలు భావించారు. కాని భవన నిర్మాణం పూర్తి అయి మూడు సంవత్సరాలు గడుస్తున్నా అద్దె భవనంలో నుండి కొత్త భవనంలోకి రాలేదు. అరకొర వసతుల మద్యన అద్దె భవనంలో కొనసాగించడంలోని ఆంతర్యం ఏమిటో అధికారులకే తెలియాలి. నూతన భవనంలో అన్నిరకాలైన వసతులు కూడా ఉన్నాయి. మూడు సంవత్సరాల నుంచి వినియోగించకపోవడం వల్ల భవనం ఎందుకు నిర్మించినట్లు, స్థలం ఎంపిక చేసే సమయంలోనే అందిరికి అనుకూలం అయినది చేస్తే బాగుండు కదా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఉన్నతస్థాయి అధికారులు స్పందించి పల్లె దవాఖానను నూతన భవనంలోకి మార్చాలని గ్రామస్థులు కోరుతున్నారు.

పంచాయతీరాజ్ వ్యవస్థను పట్టించుకోని ప్రభుత్వం

- టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి దామెర సత్యం



డిజిటల్ కార్డులను అందజేస్తున్న దామెర సత్యం

ఇల్లంతకుంట, మే 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీరాజ్ వ్యవస్థను పట్టించుకోవడం లేదని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి దామెర సత్యం పేర్కొన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం టీడీపీ సభ్యత్వాలు తీసుకున్న వారికి డిజిటల్ కార్డులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామపంచాయతీ, మండల, జిల్లాపరిషత్‌ల పాలకవర్గాల గడువు ముగిసినా ఎన్నికలు నిర్వహించలేని పరిస్థితిలో ప్రభుత్వం ఉందన్నారు. పాలకవర్గాలు లేకపోవడంతో అభివృద్ధి కుంటుపడిందని విమర్శించారు. రాబోవు స్థానిక సంస్థల ఎన్నికలలో టీడీపీకి పూర్వవైభవం తీసుకరావడానికి కృషిచేయాలన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకవెళ్లి, ప్రజల సమస్యలపై పోరాటం చేయాలన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ గజబీంకార్ ఎల్లోజీ, సీనియర్ నాయకులు చర్ల ప్రతాప్, అనుపురం చిరంజీవి, శ్రీనివాస్, నర్సయ్య, ఇమ్మడోజు మల్లికార్జున్, వసంత, రాజవ్వ, లక్ష్మి, తారవ్వ, అనసూయ, తిరుపతమ్మ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ కార్యకర్తకు పరామర్శ

కోనరావుపేట, మే 9 (ఆంధ్రజ్యోతి) : పాము కాటుకు గురై చికిత్స పొంది ఇంటికి వచ్చిన టిఆర్ఎస్ కార్యకర్త జలగం అరవింద్‌ను వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చెలిమెడ లక్ష్మీనరసింహారావు శుక్రవారం పరామర్శించారు. కోనరావుపేట మండలం కొలనూరు గ్రామానికి చెందిన అరవింద్ వ్యవసాయ పనుల్లో పాము కాటు గురయ్యాడు. హైదరాబాదులో చికిత్సపొంది ఇంటికి తిరిగి రాగా ఆయనను చెలిమెడ లక్ష్మీనరసింహారావు పరామర్శించి అండగా ఉంటామని భరోసానిచ్చారు. ఆయన వెంట కొలనూరు సింగిల్‌విండో చైర్మన్ రామ్‌మోహన్‌రావు, కోనరావుపేట ప్యాక్స్ చైర్మన్ బండ నర్సయ్య, మాజీ ఎంపీపీ చంద్రయ్య గౌడ్, సాయికిరణ్, తాళపల్లి సతీష్‌గౌడ్, మామిండ్ల అంజయ్య, వెంకటేశం, బాబు పాల్గొన్నారు.

ఆపరేషన్ సిందూర్‌కు మద్దతుగా ప్లకార్డుల ప్రదర్శన



ప్లకార్డులతో హర్షం వ్యక్తం చేస్తున్న నాయకులు, కార్మికులు

సిరిసిల్ల రూరల్, మే 9 (ఆంధ్రజ్యోతి): పాకిస్థాన్ ఉగ్రవాదులపై ఆపరేషన్ సిందూర్ పేరుతో భారత సైన్యం వీరోచితంగా పోరాటం చేయడం హర్షనీయమని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మూషం రమేష్ అన్నారు. సిరిసిల్ల పట్టణంలోని కొత్తబస్టాండ్‌లో సీఐటీయూ పాలిస్టర్ వార్పిన్ వర్కర్స్ ఆధ్వర్యంలో శుక్రవారం నాయకులు, కార్మికులు ప్లకార్డులు పట్టుకుని ఆపరేషన్ సిందూర్‌పై హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ భారత దేశంలోని కాశ్మీర్‌లోని పర్యాటక ప్రాంతమైన పహల్గాంలో హిందువులపై పాకిస్థాన్ ఉగ్రవాదులు దాడులు చేసి 26మంది పర్యాటకులను కాల్చిచంపారన్నారు. దానికి ప్రతీకారంగా పాకిస్తాన్‌లోని ఉగ్రవాదుల స్థావరాలపై మన సైనికులు వీరోచితంగా పోరాడి ముట్టబెట్టడం జరిగిందన్నారు. అదే విధంగా పాకిస్థాన్ మళ్లీ అలాంటి సంఘటనలు చేయకుండా బుద్ధి చెప్పే విధంగా పెద్దఎత్తున దాడులు నిర్వహించడం హర్ష నీయన్నారు.

ఈ కార్యక్రమంలో వార్పిన్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు సిరిమల్లె సత్యం, కుమ్మరికుంట కిషన్, ఉడుత రవి, ఎలిగేటి రాజశేఖర్, ఐరన్ ప్రవీణ్, మచ్చవేణు, ప్రసాద్, బూట్ల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సైన్యానికి మద్దతుగా జర్నలిస్టుల ర్యాలీ

వేములవాడ, మే 9 (ఆంధ్రజ్యోతి) : భారతీయులపై జరిగిన ఉగ్రదాడికి ప్రతీకారంగా ఆపరేషన్ సిందూర్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న భారత సైన్యానికి మద్దతుగా వేములవాడ ప్రెస్‌క్లబ్ సభ్యులు శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని తెలంగాణ చౌక్ నుంచి రాజరాజేశ్వర స్వామి ఆలయం వరకు నిర్వహించిన ఈ ర్యాలీలో సైన్యానికి సంఘీభావం ప్రకటించారు.

పురుగుల మందు తాగి యువతి బలవన్మరణం


కవిత (ఫైల్)

ఇల్లందకుంట, మే 9 (ఆంధ్రజ్యోతి): ఇల్లందకుంట మండలంలోని శ్రీరాముల పల్లె గ్రామానికి చెందిన మేకల కవిత(30) పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కవిత ఉన్నతచదువులు చదివి పలుఉద్యోగాలకు పోటీపరీక్షలు రాసింది. ఈక్రమంలో కుటుంబసభ్యులు అమ్మాయికి పెళ్లి చేయాలని సంబంధాలు చూస్తున్నారు. ఇటీవల కవితకు పెళ్లి సంబంధం చూశారు. కానీ కవిత ఇప్పట్లో నేను పెళ్లి చేసుకోను అని చెప్పింది. పెళ్లిపై ఇష్టం లేక గురువారం సాయంత్రం ఇంట్లో ఎవరూలేని సమయంలో పురుగుల మందుతాగింది. గమనించిన కుటుంబ సభ్యులు జమ్మికుంటలోని ఓ ప్రైవేట్‌ఆస్పత్రికి తరలించగా, మెరుగైన వైద్యంకోసం వరంగల్ ఎంజీ ఎంకు తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతిచెందింది. మృతురాలి తండ్రి మేకల సారయ్య ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ప్రొబేషనరీ ఎస్సై దీపక్‌కుమార్ తెలిపారు.

మతిస్థిమితం లేని వ్యక్తి ఆత్మహత్య

ముత్తారం, మే 9 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన మిడిదొడ్డి వెంకటేష్(31) మతిస్థిమితం లేక మద్యం మత్తులో ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ గోపతి నరేష్ తెలిపారు. మండల కేంద్రానికి చెందిన వెంకటేష్ కటింగ్ షాపు నిర్వహిస్తూ జీవనం సాగించేవాడు. కొద్ది రోజులుగా మతిస్థిమితం లేక మద్యానికి బానిసైనట్లు తెలిపారు. దీంతో శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వెంకటేష్‌కు భార్య మౌనిక ఉన్నట్లు తెలిపారు.

గుండెపోటుతో ఉద్యోగి మృతి


మల్లేశం (ఫైల్)

గన్నేరువరం, మే 9 (ఆంధ్రజ్యోతి): మండల తహసీల్దారు కార్యాలయంలో రికార్డ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న గన్నేరువరానికి చెందిన రెవెన్యూ ఉద్యోగి న్యాత మల్లేశం(55) శుక్రవారం గుండె పోటుతో మృతిచెందాడు. మల్లేశంకు శుక్రవారం తెల్లవారుజామున గుండెనొప్పి రావడంతో కుటుంబసభ్యులు కరీంనగర్ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడని వైద్యులు తెలిపారు. పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని ఇంటికి తరలించారు.

వ్యవసాయ బావిలో పడి వృద్ధురాలు మృతి


రాజుబాయి(ఫైల్)

రాయికల్, మే 9 (ఆంధ్రజ్యోతి): రాయికల్ పట్టణానికి చెందిన మామిడి రాజు బాయి (85) అనే వృద్ధురాలు వ్యవసాయ బావిలో పడి శుక్రవారం మృతి చెందింది. రాజుబాయికి మతిస్థిమితం సరిగా లేదు. ఈనెల 5న కుటుంబసభ్యులకు తెలియకుండా ఇంట్లో నుంచి వెళ్లి తిరిగి రాలేదు. మృతురాలి మనువడు మామిడి సంజీవ్ ఫిర్యాదు మేరకు రాయికల్ పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తుండగా రాయికల్ గ్రామ శివారులో గల వ్యవసాయ బావిలో పడి వృద్ధురాలు చనిపోయి కనిపించింది. మృతురాలు మతి స్థిమితం సరిగా లేనందున ప్రమాదవశాత్తు బావిలో పడి చనిపోయి ఉండవచ్చునని మృతురాలి కుటుంబసభ్యులు తెలుపగా రాయికల్ ఎస్సై సుధీర్ రావు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఈత వనం దగ్ధం


దగ్ధమైన ఈత వనంలో గీత కార్మికులు

గంభీరావుపేట (ముస్తాబాద్), మే 9 (ఆంధ్రజ్యోతి): ముస్తాబాద్ మండలం రామలక్ష్మణపల్లె గ్రామంలో గౌడ సంఘానికి చెందిన ఈతవనం దగ్ధమైంది. సమీప వ్యవసాయ పొలంలో కొయ్యకాళ్లను తగలబెడుతున్న క్రమంలో ఈతవనంకు మంటలు వ్యాపించడంతో దాదాపు 300 ఈత, తాటిచెట్లు దగ్ధమయ్యాయి. ప్రభుత్వపరంగా తమను ఆదుకోవాలని గౌడ సంఘం అధ్యక్షుడు బైరి శ్రీనివాస్‌గౌడ్, గౌడ సంఘం నాయకులు బండి లక్ష్మణ్‌గౌడ్, నర్సాగౌడ్, అంజాగౌడ్, భాస్కర్ గౌడ్, వెంకటేష్‌గౌడ్, రాములు గౌడ్ కోరారు.

ద్విచక్ర వాహనం అదుపు తప్పి యువకుడికి గాయాలు

బీర్‌పూర్, మే 9 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనం అదుపు తప్పి యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. బీర్‌పూర్ మండలం లోని ఇందిరానగర్ గ్రామానికి చెందిన పూదూరి విజయ్ కుమార్ శుక్రవారం కమ్మునూర్ బ్రిడ్జి నుంచి బీర్‌పూర్ వైపు వె ళ్తుండగా కమ్మునూర్ చౌరస్తా వద్ద వాహనం అదుపు తప్పి ప్రమాదానికి గురయ్యాడు. గమనించిన గ్రామస్థులు జగిత్యాల ఆసుపత్రికి తరలించారు.

పసుపు సాగుకు జై..

- ఈ సీజన్‌లో జగిత్యాల జిల్లాలో 50 వేల ఎకరాల్లో సాగు అంచనా
- దుక్కులు సిద్ధం చేసుకుంటున్న రైతులు
- విత్తన పసుపునకు భలే డిమాండ్
- క్వింటాలుకు రూ.6 వేల చొప్పున విక్రయం



జగిత్యాల, మే 9 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లాలో పచ్చబంగారం సాగు పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. తొలకరి రాగానే జూన్ మొదటి వారంలో పసుపు విత్తడం ఆరంభమవుతుంది. రైతులు ఇప్పటికే దుక్కులు సిద్ధం చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. ఐదేళ్లుగా సాగు విస్తీర్ణం తగ్గుతూ రాగా ఈసారి మాత్రం పసుపు పంట వేసేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. గతంలో గిట్టుబాటు ధర దక్కక సాగుకు దూరమైన వారు తిరిగి వేసేందుకు ఆలోచన చేస్తున్నారు. ఈ సీజన్‌లో అనూహ్యంగా రికార్డు స్థాయి ధరలు నమోదు కావడంతో పసుపు రైతుల్లో ఆశలు పెంచింది. రైతులు ప్రస్తుతం విత్తనం సేకరించే పనుల్లో ఉన్నారు.



ఐదేళ్ల తర్వాత మార్పు

జగిత్యాల జిల్లాలో గడిచిన నాలుగు, ఐదు సంవత్స రాల్లో 35 వేల నుంచి 40 వేల ఎకరాల్లో సాగు అయ్యేది. మద్ద తు ధరలు అంతంత మాత్రం గానే ఉండడంతో గత సీజన్‌లో 25 వేల ఎకరాలకు పడి పోయింది. ప్రస్తుత సీజన్‌లో పసుపు ధర పుంజుకొని సరాసరి రూ.13 వేల నుంచి రూ. 20 వేల వరకు ధర పలి కింది. కొమ్ముకే కాదు, మండ పసుపుకు కూడా డిమాండ్ రావడంతో రైతులను ఇటు వైపు మొగ్గు చూపేలా చేస్తోందని అధికారులు అంటున్నారు. పసుపునకు ఆశించిన ధర రావడం, పసుపు బోర్డు ఏర్పాటు కావడం తదితర కారణాల వల్ల ఈ ఏడాది గతంలో కంటే సాగు పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. జగిత్యాల జిల్లాలో సుమారు 50 వేల ఎకరాల్లో పసుపు సాగు అయ్యే అవకాశాలున్నాయని వ్యవసాయ, ఉద్యా నవన శాఖ వర్గాలు అంటున్నాయి.

చిగురిస్తున్న ఆశలు

పసుపు రైతులకు ఈ ఏడాది వరస నష్టాల నుంచి ఉపశమనం లభించింది. మార్కెట్‌లో గిట్టుబాటు ధర దక్కడంతో చేసిన కష్టానికి ప్రతిఫలం దక్కింది. రైతుల్లో సాగుపై మళ్లీ ఆశలు చిగురించాయి. ఈసారి సాగు విస్తీర్ణం రెట్టింపు అయ్యే అవకాశాలు కనిస్తున్నాయి. దీంతో విత్తన పసుపునకు డిమాండ్ ఏర్పడింది. గతేడాది క్వింటాకు రూ. 4 వేలు ఉన్న విత్తన పసుపు ధర ఇప్పుడు రూ.6 వేలు పలుకుతోంది. కొనుగోలుకు పసుపు రైతుల్లో ఆసక్తి ఉన్నా విత్తనం దొరకడం లేదు.

పసుపు సాగు పెరుగుతోంది

సోమ శ్రీనివాస్, పసుపు రైతు, గోదూరు గ్రామం, జగిత్యాల్ల



ప్రస్తుత సీజన్‌లో పసుపు సాగు పెరగనుంది. పసుపునకు మార్కెట్‌లో అధిక ధరలు రావడం, పసు పు బోర్డు ఏర్పాటు తదితర అంశాలు పసుపు సాగు పెరగడానికి కారణంగా మారింది. పలువురు రైతులు పసుపు సాగు చేయడానికి మొగ్గు చూపుతు న్నారు. ఇప్పటికే దుక్కులు దున్ని సిద్ధంగా ఉన్నారు.

రెస్టారెంట్లు, టిఫిన్‌సెంటర్లపై మున్సిపల్ అధికారుల దాడులు

- రూ.18 వేల జరిమానా

కోరుట్ల, మే 9 (ఆంధ్రజ్యోతి) : కోరుట్ల పట్టణంలోని పలురెస్టారెంట్లు, బేకరీ, టిఫిన్‌సెంటర్లు, హోటళ్లు, ప్లాస్టిక్ దుకాణాలపై శుక్రవారం మున్సిపల్ అధికారులు దాడులు నిర్వహించారు. తినుబండారాలను, సింగిల్‌యూస్ ప్లాస్టిక్‌ను స్వాధీనం చేసుకొని రూ.18,000జరిమానాలు విధించారు. ఈ సందర్భంగామున్సిపల్ కమిషనర్ మారుతిప్రసాద్ మాట్లాడుతూ సింగిల్‌యూజ్ ప్లాస్టిక్‌వినియోగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని అన్నారు. ట్రేడ్‌లైసెన్స్ లేనివారు వెంటనే తీసుకోవాలని సూచించారు. తడి,పొడి, హానికరమైన చెత్తగా వేరుచేసి దుకాణాలకు వచ్చే మున్సిపల్ వాహనాలకు అందించాలని లేనిచో జరిమానాలను విధిస్తామని తెలిపారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాలేఅశోక్, రాజేంద్రప్రసాద్, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్‌మహేష్, సిబ్బంది హేమంత్, రాజు, రమేష్ పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కరీంనగర్ క్రైం, మే 9 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలంలో అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న నాలుగుట్రాక్టర్లను శుక్రవారం పట్టుకున్నట్లు కొత్తపల్లి పోలీసులు తెలిపారు. ట్రాక్టర్ డ్రైవర్లు, యజమానులపై కేసులు నమోదుచేశామని పేర్కొన్నారు. ఇసుక ట్రాక్టర్లను సీజ్‌చేసినట్లు తెలిపారు.

తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

- ఎన్టీపీసీ కాంట్రాక్టు కార్మికుల ధర్నా


ఎన్టీపీసీ టౌన్‌షిప్‌లో ధర్నా చేస్తున్న కార్మికులు

జ్యోతినగర్, మే 9 (ఆంధ్రజ్యోతి): ఎన్టీపీసీ పర్మినెంటు టౌన్‌షిప్(పీటీఎస్)లో తొలగించిన కాంట్రాక్టుకార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని ఐఎఫ్‌టీయూ అనుబంధ జిల్లా కాంట్రాక్టు కార్మికులసంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. టౌన్‌షిప్ షాపింగ్ కాంప్లెక్స్ ఆవరణలో 100 మంది కార్మికులు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు లుక శంకర్ మాట్లాడుతూ ఇటీవల టౌన్‌షిప్‌లోని వివిధ జోన్లకు సంబంధించి టెండర్లలో మ్యాన్ పవర్‌ను తగ్గించి కాంట్రాక్టర్లకు పనులు అప్పగించడంతో కార్మికులు అయోమయంలో పడ్డారన్నారు. కొత్త టెండర్లలో కార్మికులను తగ్గించి టెండర్లను పిలవడంతో మూడు దశాబ్దాలుగా పనిచేస్తున్న కొంత మంది కార్మికులను తొలగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్టీపీసీ యాజమాన్యం ఇచ్చిన ఆదేశాల మేరకు 60 సంవత్సరాలు దాటిన కార్మికుల పిల్లలకు డిపెండెంటు ఎంప్లాయ్‌మెంట్ కింద పనులు కల్పించిందని, దీంతో చాలామంది కార్మికులు తమ వారసులను తమస్థానాల్లో ఉద్యోగాలు కల్పించారన్నారు. కొత్త టెండర్లలో డిపెండెంట్ ఎంప్లాయ్‌మెంట్ కింద చేరిన వారిని చేర్చలేదన్నారు. దీనివల్ల ఆకార్మికులను తొలగించేందుకు సదరు కాంట్రాక్టర్లు సిద్ధయయ్యారన్నారు. ఇప్పటికే కొంతమంది కార్మికులను విధుల నుంచి తొలగించారని తెలిపారు. కొత్త టెండర్లతోపాటు పాత టెండరులో ఉన్న అందరు కార్మికులను చేర్చి కార్మికులకు న్యాయం చేయాలని శంకర్ డిమాండ్ చేశారు. లేకుంటే సోమవారం నుంచి ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. తాము టౌన్‌షిప్‌లో విధులుబహిష్కరిస్తే ఎన్టీపీసీ యాజమాన్యమే బాధ్యత వహించాలని, తప్పని పరిస్థితుల్లో తాము విధులు బహిస్కరంచాల్సి వస్తున్నదన్నారు. 2022లో ఎన్టీపీసీ యాజమాన్యంతో జరిగిన ఒప్పందం ప్రకారం 1,020 రూపాయల అలవెన్సులను కార్మికులకు చెల్లించడం లేదని, 16 నెలల ఏరియర్స్‌ను తక్షణం చెల్లించాలని డిమాండ్ చేశారు. టౌన్‌షిప్‌లోని నాలుగు జోన్లను క్లబ్ చేసి ఎ రాజేశం అనే కాంట్రాక్టరుకు పనులను అప్పగించారన్నారు. ఈ విషయంలో యాజమాన్యం స్పందించి చర్చలకు పిలిచి సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బుచ్చన్న, స్వామి, రవి, కృష్ణ, మొండయ్య, ఓదెలు, నర్సయ్య, రమేష్, శంకర్, చిరంజీవి, రాయమల్లమ్మ, సూరమ్మ, ఓదెమ్మ, హైమవతి, పద్మ, స్వరూప, సంధ్య, సరోజన, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

ముత్తారం, మే 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రంగయ్య పల్లి మూల మలుపు వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు కాగా మరొకరికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. గోదావరిఖనికి చెందిన శత్రువేదుల శ్రావణ్ తన సోదరుడు శశిధర్ కలిసి భూపాలపల్లి జిల్లా జంగ పల్లికి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో ముత్తారం మండలంలోని ఖమ్మంపల్లి-మంథని ప్రధాన రహదారి రంగయ్యపల్లి మూలమలుపు వద్ద ఉన్న టేకు చెట్లను ప్రమాదవశాత్తు ఢీకొట్టింది. బైక్ నడుపుతున్న శ్రావణ్‌కు తీవ్రగాయాలయ్యాయి. శశిధర్‌కు స్వల్ప గాయాలు కావడంతో స్థానికులు వెంటనే 108కి సమాచారం ఇవ్వగా గాయపడ్డ వారిని మంథని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ప్రయాణికురాలిపై కోతుల దాడి

ఓదెల, మే 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పొత్కపల్లి రైల్వే స్టేషన్‌లో శుక్రవారం ఓప్రయాణికురాలిపై కోతులు దాడిచేయ డంతో తీవ్రగాయాలయ్యాయి. కొత్తగూడెంకు చెందిన బండి స్రవంతి రైల్వే స్టేషన్‌లోని కౌంటర్‌వద్దకు టికెట్ కోసం వెళుతున్న క్రమంలో కోతులు అకస్మాత్తుగా దాడిచేసి నోటకరిచాయి. దీంతో మహిళ ముఖంపై తీవ్రగాయాలయ్యాయి. పొత్కపల్లికి చెందిన బంధువు గూడెపు సంజీవరెడ్డి ఇంటికి వచ్చి తిరిగి వెళుతున్న క్రమంలో ఇక్కడి రైల్వేస్టేషన్‌లో సంఘటన చోటుచేసుకుంది. గాయాలకు గురైన మహిళను జమ్మికుంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.

విద్యుదాఘాతంతో రైతుకు గాయాలు


గాయపడ్డ రైతు కొమురయ్య

తంగళ్లపల్లి, మే 9 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలం అంకుసాపూర్ గ్రామానికిచెందిన రైతు జీల కొమురయ్య(48) విద్యుదాఘాతానికి గురై తీవ్రంగా గాయపడ్డాడు. తన పొలం వద్ద ట్రాన్స్‌ఫార్మర్ ఫ్యూజు పోవడంతో విద్యుత్‌సరఫరా నిలిచిపోయింది. త్వరగా ఫ్యూజువేసి విద్యుత్‌సరఫరా పునరుద్ధరించి తనపొలానికి నీరు అందించాలని భావించి ట్రాన్స్‌ఫార్మర్‌కు ఫ్యూజు వేస్తున్న క్రమంలో విద్యుదాఘాతానికి గురయ్యాడు. దీంతో కొమురయ్య తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడ్డ రైతును భారతీయ కిసాన్ జిల్లా అధ్యక్షుడు పులి లక్ష్మీపతిగౌడ్, కార్యదర్శి బియ్యంకార్ శ్రీనివాస్‌లు పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యుత్ శాఖకు సంబంధించిన హెల్పర్ స్పందించి ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేయాల్సి ఉండగా నిర్లక్ష్యంగా వ్యవహరించాడని ఆరోపించారు. హెల్పర్ నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో రైతు మరమ్మతులుచేసే క్రమంలో విద్యుత్ గురయ్యాడన్నారు. ఈసంఘటనపై ఉన్నతాధికారులు విచారణ జరిపించి రైతుకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

చెరువు మట్టి.. చేనుకు పుష్టి

చేలలో భూసారం పెరుగుదలకు దోహదం..

చొప్పదండి, మే 9 (ఆంధ్రజ్యోతి): చెరువు మట్టి పంట చేలకు ఎంతో మేలు చేస్తుంది. ఎర్రనేలలో చెరువు మట్టి పోస్తే చేనుకు పుష్టి చేకూరుతుంది. ఎండాకాలంలో నీరంతా ఇంకిపోయి చెరువు ఎండిపోగానె పూడికతీత పనులను ప్రారంభిస్తారు. ఆ మట్టిని రైతులు తమ పొలాల్లో పోసుకుంటున్నారు. రైతులు తమ పంట చేనులో చెరువుమట్టిని వేసుకుంటే అనేక ప్రయోజనాలున్నాయి. వర్షాలు పడినప్పు డు అనేక పోషకవిలువలు కలిగిన సారవంత మైన మట్టి చెరువులోకి వచ్చి చేరుతుంది. ప్రస్తుతం గ్రామాల్లోని చెరువుల్లో పూడిక పనులు ప్రారంభంకానున్న నేపథ్యంలో చెరువు మట్టి ప్రాముఖ్యత వివరాలు..

చెరువు మట్టితో ప్రయోజనాలు..

- చెరువు మట్టితో రైతుల పంట దిగుబడి పెరుగుతుంది.
- చెరువు మట్టిని చేనులో పోయడం ద్వారా ఆమ్ల, క్షార గుణాలను తటస్థంగా మారతాయి.
- నేలలోని లవణాల ఘాడత తగ్గుతుంది.
- మట్టితో పాటు సేంద్రియ ఎరువు కలిపి వేసుకుంటే రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించవచ్చు.
- మొక్కలు ఆరోగ్యంగా ఏపుగా పెరుగుతాయి.
- కలుపు, వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనే శక్తి నేలకు కలుగుతుంది.
- దిగుబడి పెరిగి రైతులకు అధిక ఆదాయం వస్తుంది. నేల సార వంతంగా మారుతుంది.
- చెరువులో పూడిక మట్టి తరలింపుతో వర్షాకాలంలో నీటినిల్వలు పెరుగుతాయి. తద్వారా గ్రామంలో భూగర్భ నీటిమట్టం పెరుగుతుంది.


చేనులో చెరువు మట్టి

లారీ డ్రైవర్‌పై డ్రంకెన్‌డ్రైవ్ కేసు

కరీంనగర్ క్రైం, మే 9(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ శివారులోని బొమ్మకల్ ఫ్లైఓవర్ వద్ద శుక్రవారం కరీంనగర్ ట్రాఫిక్ ఏసీపీ యాదగిరి స్వామి ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. మోతాదుకు మించి మద్యం తాగిన లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేశారు. లారీని వేగంగా నడుపుతూ నో ఎంట్రీ ప్రాంతంలోకి ప్రవేశించడాన్ని గుర్తించిన పోలీసులు బ్రీత్‌ఎనలైజర్‌తో డ్రైవర్‌ను పరీక్షించారు. మోతాదుకు మించి అత్యధికంగా 100 ఎంఎల్ రక్తంలో 550 మిల్లీ గ్రాముల ఆల్కాహాల్ ఉన్నట్లు వెల్లడైంది. దీంతో డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు, లారీని అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. తనిఖీల్లో సీఐ పర్శ రమేష్, ఎస్సై ఇషాక్ అహ్మద్ పాల్గొన్నారు.

రూ.7410 పలికిన పత్తి ధర

జమ్మికుంట, మే 9 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.7410 పలికింది. నలుగురు రైతులు 36క్వింటాళ్లు విడిపత్తి విక్రయానికి తీసుకువచ్చారు. ప్రైవేట్‌ట్రేడర్స్ బహిరంగ వేలంపాట ద్వార గరిష్ఠ ధర రూ.7410, కనిష్ఠ ధర రూ.6950 చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

ఏసీబీ వలకు చిక్కిన అవినీతి అధికారి

- రూ.60వేలు లంచం తీసుకుంటుండగా అదుపులోకి


ఏసీబీకి పట్టుబడిన ఇరిగేషన్ ఈఈ అమరేందర్‌రెడ్డి

కరీంనగర్ క్రైం, మే 9 (ఆంధ్రజ్యోతి): నీటిపారుదలశాఖలో అవినీతి అధికారిని కరీంనగర్ అవినీతి నిరోధకశాఖ పోలీసు అధికారులు వలవేసి పట్టుకున్నారు. రాజన్నసిరిసిల్ల జిల్లా నీటిపారుదల శాఖలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈఈ)గా పనిచేస్తున్న ఎర్రంరెడ్డి అమరేందర్ రెడ్డి శుక్రవారం రాత్రి ఒక కాంట్రాక్టర్ నుంచి రూ.60వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ పోలీసులకు పట్టుబడ్డాడు. నీటిపారుదల శాఖలో రాజన్నసిరిసిల్ల జిల్లాలోని డివిజన్-7 అవునూర్, అగ్రహారం గ్రామాల్లో చెక్‌డ్యాం నిర్మాణంకు సంబంధించిన రూ.50లక్షల బిల్లు ఎంబీరికార్డు చేసేందుకు కాంట్రాక్టర్‌ను ఈఈ ఎర్రంరెడ్డి అమరేందర్‌రెడ్డి కొద్దిరోజులుగా లంచం డబ్బుల కోసం వేధిస్తున్నాడు. దీంతో బాధితుడు ఏసీబీ పోలీసులను ఆశ్రయించాడు. రూ.50లక్షల బిల్లుమంజూరు కోసం లక్ష రూపాయలు డిమాండ్ చేయగా చివరకు 75వేల రూపాయలకు ఒప్పందం కుదిరింది. లంచం డబ్బులు ఇంటివద్ద ఇవ్వాలని చెప్పగా ఏసీబీ పోలీసుల సూచన మేరకు రాత్రి 8గంటల ప్రాంతంలో లంచం డబ్బులు రూ.60వేలు కరీంనగర్ విద్యారణ్యపురిలో ఈఈ అమరేందర్ రెడ్డి ఇంటివద్ద కాంట్రాక్టర్ ఇస్తుండగా కరీంనగర్ అవినీతి నిరోధకశాఖ డీఎస్పీ వీవీ రమణమూర్తి ఆధ్వర్యంలో పోలీసులు మాటువేసి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఇదే చెక్‌డ్యాంకు సంబంధించిన రూ.5కోట్ల రూపాయల బిల్లురికార్డు చేసేందుకు ఈఈ ఇంతకుముందు4లక్షల రూపాయలు బాధితుడి నుంచి తీసుకున్నాడని ఏసీబీ డీఎస్పీ తెలిపారు. లంచంకు సంబంధించిన రూ.60 వేల నగదును సీజ్‌చేశారు. నిందితుడు ఈఈ అమరేందర్‌రెడ్డిని అరెస్టుచేసిన ఏసీబీ పోలీసులు కస్టడీకి తీసుకున్నారు. శనివారం కరీంనగర్ ఏసీబీకోర్టులో అతడిని హాజరు పరుచనున్నట్లు తెలిపారు.

లంబడితండా(బి)లో ఎక్సైజ్ దాడులు


పట్టుకున్న గుడుంబాతో ఎక్సైజ్ అధికారులు

ధర్మారం, మే 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లంబాడితండా(బి) గ్రామంలో ఎక్సైజ్ శాఖ-డిస్ట్రిక్టటాస్క్‌ఫోర్స్ సంయుక్తంగా గుడుంబా స్థావరాలపై శుక్రవారం దాడులు నిర్వహించింది. ఈ దాడుల్లో 18 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకోగా, ఇద్దరు వ్యక్తులు పరారీలో ఉన్నట్లు వారిపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ ఎస్ఐ జీవన్‌రెడ్డి తెలిపారు. ఈ దాడుల్లో డిస్ట్రిక్ట్ టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ పావనితోపాటు పదిమంది సిబ్బంది పాల్గొన్నారు. ఎవరైన నాటుసారా, గుడుండా తయారుచేస్తే వారిపై శాఖాపరమైన చర్యలు ఉంటాయని డిస్ట్రిక్ట్ టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ పావని హెచ్చరించారు.

సౌకర్యాలు సద్వినియోగం చేసుకోవాలి

కరీంనగర్ రూరల్, మే 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మైనార్టీ గురుకులాల్లో కల్పిస్తున్న సౌకర్యాలపే సద్వినియోగం చేసుకోవాలని మైనార్టీ గురుకుల ఆర్ఎల్‌సీ కనపర్తి సురేష్ కుమార్ అన్నారు. శుక్రవారం అస్లాం మసీద్ దగ్గర ఇరుకుల్ల మైనార్టీగురుకుల పాఠశాలలో కల్పిస్తున్నసౌకర్యాలపై ఉపాధ్యాయ బృందంతో కలిసి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో అల్పసంఖ్యాకులు అందరితో సమానంగా ఎదగడానికి గురుకులాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో స్కూల్ కో-ఆర్డినేటర్ మహేందర్, కాలేజ్ కో-ఆర్డినేటర్ రాజు, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

పట్టపగలే దొంగల బీభత్సం

- రూ.30 వేల నగదు, రూ.3.50 లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాల అపహరణ

ఎల్లారెడ్డిపేట, మే 9 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో శుక్రవారం పట్టపగలే దొంగలు బీభత్సం సృష్టించారు. గ్రామంలో తాళం వేసి ఉన్న వొద్దిరాల శ్రీనివాస్ ఇంటిలో గుర్తుతెలియని వ్యక్తులు చొరబడ్డారు. బీరువా, ఇతర వస్తువులను చిందరవందరగా పడేశారు. ఇంటిలో దాచుకున్న రూ.30 వేల నగదు, రూ.3.50 లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాలను ఎత్తుకొనిపోయారు. శ్రీనివాస్, తన భార్య ఇద్దరు బస్టాండు ప్రాంతంలో కర్రీ పాయింట్‌తో పాటు చపాతీలు తయారుచేస్తూ జీవిస్తున్నారు. ఉదయం ఇంటికి తాళం వేసి దుకాణానికి చేరుకున్నారు. గుర్తు తెలియని వ్యక్తులు ఇంటికి వేసిన తాళం పగులగొట్టి ఉన్నదంతా ఊడ్చుకుపోయారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. పట్టపగలే చోరీకి పాల్పడడంతో కాలనీవాసులు ఆందోళన చెందుతున్నారు. బాధితుడు శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వివరించారు.

ఎన్టీపీసీ ప్లాంటులో విపత్తు జరిగితే ఎదుర్కొంటాం

రామగుండం సీపీ అంబర్ కిశోర్ ఝా



మాక్ డ్రిల్‌లో సిబ్బందికి సూచనలు చేస్తున్న సీపీ అంబర్ కిశోర్ ఝా

జ్యోతినగర్, మే 9 (ఆంధ్రజ్యోతి): ఎన్టీపీసీ ప్లాంటులో ఏవైనా అనుకోని ఘటనలు జరిగితే వాటిని సమర్థవంతంగా ఎదుర్కొంటామని రామగుండం సీపీ అంబర్ కిశోర్ ఝా స్పష్టం చేశారు. ఈ విషయంలో ప్రతీ క్షణం అధికార యంత్రాంగం, సిబ్బంది సన్నద్ధంగా ఉందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు శుక్రవారం సాయంత్రం ఎన్టీపీసీ ప్రాజెక్టు ఆవరణలో భద్రతా సిబ్బందితో సీపీ ఆధ్వర్యంలో మాక్ డ్రిల్ నిర్వహించారు. అనుకోని దుస్సంఘటన జరిగినప్పుడు అప్రమత్తంగా ఉండడంలో భాగంగా తీసుకోవాల్సిన చర్యలకు సంబంధించి మాక్‌డ్రిల్ నిర్వహించినట్లు సీపీ పేర్కొన్నారు. ఏదైనా ప్రమాదం, అగ్ని ప్రమాదాలు జరినప్పుడు భద్రతా దళాలు ఎలాంటి చర్యలు తీసుకోవాలనే అంశాలను మాక్‌డ్రిల్ ద్వారా వివరించామన్నారు. కార్యక్రమంలో పెద్దపల్లి డీసీపీ కరుణాకర్, గోదావరిఖని ఏసీపీ ఎం రమేష్, ఎస్బీ ఏసీపీ రాఘవేంద్రరావు, ఎన్టీపీసీ ఎస్ఐ ఉదయ్ కిరణ్, భద్రతా సిబ్బంది పాల్గొన్నారు.

సీఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో మాక్ డ్రిల్



డాగ్ స్క్వాడ్‌తో తనిఖీ చేస్తున్న సీఐఎస్ఎఫ్ జవాను

జ్యోతినగర్, మే 9 (ఆంధ్రజ్యోతి): రామగుండం ఎన్టీపీసీ ప్రాజెక్టు ఆవరణలో సీఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం మాక్ డ్రిల్ నిర్వహించారు. పాకిస్తాన్‌తో యుద్ధం జరుగుతున్న క్రమంలో ఏదైనా విపత్తు జరిగితే తీసుకోవాల్సిన చర్యలకు సంబంధించి మాక్ డ్రిల్ నిర్వహించారు. బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ తనిఖీలు, ప్రాజెక్టు పరిసరాల్లో, పని స్థలాల్లో తనిఖీలు తదితర అంశాలను మాక్ డ్రిల్‌లో ప్రదర్శించారు. సీఐఎస్ఎఫ్ రావగుండం ఎన్టీపీసీ యూనిట్ సీనియర్ కమాండెంట్ అరవింద్ కుమార్, డిప్యూటీ కమాండెంట్ అంజనేయరాజు, డిప్యూటీ కమాండెంట్ ఓవికె శాస్త్రి పర్యవేక్షణలో జరిగిన మాక్ డ్రిల్‌లో అసిస్టెంట్ కమాండెంట్లు జై కన్వర్, అకేశ్వర్‌సింగ్, ఇన్‌స్పెక్టర్లు, జవానులు పాల్గొన్నారు.

రాజన్న ఆలయ అభివృద్ధికి మహర్దశ

- చారిత్రక, పురాణాల ప్రాశస్త్యానికి ఇబ్బంది లేకుండా అభివృద్ధి
- మొదటి విడత రూ.76.73 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం
- భీమన్న ఆలయంలోనే భక్తులకు దైవ దర్శనాలు
- ప్రధాన గర్భాలయం ముట్టకుండా అభివృద్ధి పనులు
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కృషితో నిధులు మంజూరు

వేములవాడ కల్చరల్, మే 9 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వేములవాడ రాజన్న ఆలయ అభివృద్ధికి మహర్దశ పట్టనుంది. స్థానిక శాసన సభ్యుడు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కృషితో ప్రభుత్వం శ్రీకారం చుడుతోంది. రాజన్న ఆలయ అభివృద్ధిని మూడు దశల్లో అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. తొలి దశ పనులను జూన్ మాసం నుంచి ప్రారంభించేందుకు నిర్ణయించారు. జూన్15వ తేదీ నుంచి రాజన్న ప్రధాన దేవాలయంలోకి భక్తులను అనుమతించరు. నిత్యపూజలను మాత్రం అర్చకులు ప్రధాన దేవాలయ గర్భాలయంలో నిర్వహిస్తారు.

భక్తులకు దైవ దర్శనాన్ని స్థానిక భీమేశ్వర స్వామి ఆలయంలో దర్శించుకు నేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. శృంగేరి పీఠాధిపతి సూచించిన మార్పులను పరిగణలోకి తీసుకుని చారిత్రక, పురాణాల నేపథ్యం ఉన్న భాగాలను, పురాతన గ్రంథాలు, పూర్వం రాతి శాసనాల్లో పేర్కొన్న విధంగా ప్రాశస్త్యానికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయ అభివృద్ధిని విస్తరించేందుకు ముందుకు సాగుతున్నారు. పురాణ నేపథ్యం కలిగిన ధర్మగుండం, గుడి చెరువు ప్రాశస్త్యం తగ్గకుండా 40ఎకరాల్లో విడతల వారీగా అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. అన్నదాన సత్రం, క్యూ కాంప్లెక్స్‌లు, వసతిగృహాలు, రెండు ప్రాకారాలు, కార్యాలయం, కోనేరు, కల్యాణకట్ట, కోడె మొక్కుల ప్రాంతం వంటి వాటిని కొత్తగా నిర్మించనున్నారు. ఇందకు మూడు దశల్లో రాజన్న ఆలయ అభివృద్ధికి రూ.550 కోట్ల వ్యయం అవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇప్పటికే ప్రభుత్వం ఆలయ విస్తరణకు రూ.76 కోట్లు, కల్యాణ మండపానికి రూ.33 కోట్లు, రోడ్ల విస్తరణ పనులకు రూ.47.86 కోట్ల నిధులు మంజూరు చేసింది. ఇటీవల బడ్జెట్‌లో మరో రూ.100కోట్లు ప్రభుత్వం ప్రతిపాదించింది.

1979లో ఆలయ పునరుద్ధరణ..

వేములవాడ రాజన్న ఆలయ పునరుద్ధరణ 1979లో చేపట్టారు. ఆలయ సంప్రదాయ నిర్మాణ ఆధారంగా అప్పట్లో గర్భగుడి ద్వారాలు, రాజగోపురాలను ఆధునిక శైలిలో మరమ్మతులు చేసి ఆధునికీకరించారు. ధర్మగుండం, ఆలయ ప్రాంగణంలో ఉన్న పరివార దేవాలయాలు, కోటిలింగా లను ప్రత్యేక ఆకర్షణగా నిర్మించారు. కాగా భవిష్యత్ తరాలకు ఆదర్శంగా నిలిచేలా ప్రస్తుతం ఆలయ అభివృద్ధి ఉండనుంది. పురాతన శిల్పకళ, శైవ సంప్రదాయాలు ఉట్టిపడేలా ఆలయాన్ని విస్తరించనున్నారు. రాజన్న ఆలయాన్ని సౌందర్యానికి ప్రతిరూపంగా రూపుదిద్దేలా ప్రణాళికలు చేస్తున్నారు. ధర్మగుండం మధ్యలో శివుడి విగ్రహం, భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతిని అందించడం కోసం ధర్మగుండం చుట్టూ పార్క్, నడక మార్గాలతో పాటు ఆకట్టుకునే డిజైన్‌లను తయారు చేస్తున్నారు.





వేములవాడ రాజన్న ప్రధాన ఆలయ ఊహాచిత్రం

శృంగేరి శంకరమఠం పీఠాధిపతి సూచనలతోనే..

చారిత్రక, పౌరాణిక నేపథ్యం ఉన్న భాగాలను, పురాణాలు, పురాతన గ్రంథాల, 1970లో వెలుగుచూసిన రాతి శాసనాల్లో పేర్కొన్న విధంగా ప్రాశస్త్యానికి ఎక్కడా ఇబ్బంది లేకుండా ఆలయ అభివృద్ధిని చేసేందుకు నిర్ణయించారు. ఆలయ విస్తరణ పనుల్లో వేములవాడ చాళుక్యుల శైలి మూర్తీ భవించేలా నిర్మాణం జరగనుంది.

తెలంగాణలో ఎంతో గొప్పగా నిర్వహించే బతుకమ్మ పండుగను రాష్ట్ర వ్యాప్తంగా 9 రోజులు జరుపుకుంటే వేములవాడలో మాత్రం 7 రోజులు నిర్వహిస్తారు. బతుకమ్మ పుష్పం నుంచే ఆలయం ఉద్భవించిందన్న పౌరాణికగాథ అనుగుణంగా బతుకమ్మ గుర్తులు ప్రతిబింబించేలా నిర్మాణం చేపట్టనున్నారు. సరైన ప్రణాళిక లేకపోవడంతో గతంలో ఆలయ పునరుద్ధరణ వంకరగా జరిగిందని, ప్రస్తుత విస్తరణ పనుల్లో రెండు ప్రాకా రాలు, రెండు వీధులతో క్రమ పద్ధతిలోకి మార్చనున్నారు. నాలుగు ఎకరాల్లో ఉన్న ఆలయాన్ని 4.6 ఎకరాలకు పెంచనున్నారు.



భీమేశ్వర స్వామి ఆలయం

చరిత్రలో నిలిచేలా రాజన్న ఆలయాన్ని అభివృద్ధి చేస్తాం..

వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



దక్షిణభారత దేశంలోనే ప్రముఖ శైవ క్షేత్రంగా వేములవాడ రాజన్న ఆలయం కొనసాగుతోంది. నిత్యం వేల సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివస్తున్నారు. రాజన్న ఆలయాన్ని అభివృద్ధి చేయాలనేది నా చిరకాల వాంఛ. దాని కోసం ఎంతో ఆత్రుతగా ఎదురు చూస్తున్నాను. నేను ఎమ్మెల్యేగా ఉండగా ఆలయ అభివృద్ధి జరగడం ఎంతో సంతోషంగా ఉంది. వచ్చే వెయ్యి ఏళ్ల గుర్తుండేలా ఆలయ విస్తరణ చేయాలని అనుకుంటున్నాము. రాజన్న ఆలయ అభివృద్ధి కోసం సీఎం రేవంత్ రెడ్డితోపాటుగా ఎనిమిది మంది మంత్రులతో శంకుస్థాపన కార్యక్రమాలను చేసుకున్నాము. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా భీమేశ్వర ఆలయంలో దైవ దైర్శనం కల్పిస్తాము. ఎంతో చారిత్రక, పురాణ నేపథ్యం కలిగి ఉన్న విభాగాలను ముట్టకుండా శృంగేరి శంకరమఠం పీఠాధిపతుల సూచనలు, సలహాల మేరకే ఆలయ విస్తరణ పనులను చేపడుతున్నాము.



గుడి చెరువు అభివృద్ధి ఊహాచిత్రాలు

పవర్ లిఫ్టింగ్‌లో సిరిచందనకు కాంస్యం



సాధించిన పతకం ప్రశంస పత్రంతో సిరిచందన

కరీంనగర్ స్పోర్ట్స్, మే 9 (ఆంధ్రజ్యోతి): ఏషియన్ జూనియర్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో జిల్లాకు చెందిన తుడి సిరిచందన కాంస్య పతకం సాధించింది. ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్‌లో ఈ నెల 6 నుంచి 12 వరకు నిర్వహించిన ఏషియన్ జూనియర్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో గంగాధర మండలం మల్లిగడ్డకు చెందిన సిరిచందన 52 కేజీల విభాగంలో 330 కిలోల బరువును ఎత్తి కాంస్యం సాధించింది. గత డిసెంబరు 16 నుంచి 19 వరకు ఢిల్లీ సర్దార్ సింగ్ స్టేడియంలో నిర్వహించిన పవర్‌లిఫ్టింగ్ ఇండియా ఫెడరేషన్ కప్ జాతీయ చాంపియన్‌షిప్‌లో 330 కిలోల బరువు ఎత్తి రజతం సాధించింది. దీంతో ఏషియన్ పవర్ లిఫ్టింగ్ పోటీలకు భారత జట్టు తరఫున ఆమె ఎంపికైంది. ఈ సందర్భంగా జిల్లా యువజన క్రీడాశాఖ అధికారి శ్రీనివాస్‌గౌడ్, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నందెల్లి మహిపాల్, గసిరెడ్డి జనార్దన్ రెడ్డి, జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు దామోదర్, ఎస్సారార్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామకృష్ణ, ఫిజికల్ డైరెక్టర్ నాగేశ్వర్‌రావు, పవర్ లిఫ్టింగ్ కోచ్ భీమనాతిని మల్లేశం అభినందించారు.



ఏషియన్ పవర్ లిఫ్టింగ్ పోటీల వేదికపై సిరిచందన

మానసాదేవి ఆలయంలో కొనసాగుతున్న వార్షికోత్సవం

గన్నేరువరం, మే 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఖాసింపేట మానసాదేవి ఆలయంలో నిర్వహిస్తున్న సప్తమ వార్షిక వేడుకలు రెండోరోజు శుక్ర వారం కొనసాగాయి. ఈ వేడుకల్లో ఉదయం చండీ హోమం, 108మంది మహిళలతో సామూహిక కుంకుమార్చన, మానసాదేవికి లక్ష పుష్పార్చన, మహేశ్వరునికి భస్మాభిషేకం నిర్వహించారు. ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ జిల్లాల నుంచి భక్తులు అధికసంఖ్యలో వేడుకలకు హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయకమిటీ ఆధ్వర్యంలో అన్ని సౌకర్యాలు కల్పించి అన్నదానం నిర్వ హించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ ఏలేటి చంద్రారెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ముస్కు ఉపేందర్‌రెడ్డి, నాయకులు అల్లూరి శ్రీనాథ్‌రెడ్డి, కొమ్మెర రవిందర్‌రెడ్డి, పులి కృష్ణ, అలువాల కోటి, బద్దం సంపత్‌రెడ్డి పాల్గొన్నారు.



మానసాదేవి ఆలయంలో కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

- వాకింగ్‌తో పలు ప్రయోజనాలు
- నేడు వరల్డ్ మూవ్ ఫర్ హెల్త్ డే

నడకతో ఆరోగ్యం



కరీంనగర్ స్పోర్ట్స్, మే 9 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం జీవన విధానంలో ప్రజలకు తగిన వ్యాయామం లేక శరీరంపై నియంత్రణ లేకుండాపోతోంది. ప్రజలు బీపీ, షుగర్, స్థూల కాయంతో పడుతున్నారు. ప్రతి రోజు కనీసం 45 నిమిషాలు నడవాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. ఇప్పుడిప్పుడే ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన పెరుగుతోంది. నడకను తమ జీవితంలో భాగంగా చేసుకుంటున్నారు. ఉదయం, సాయంత్రం మైదానాలు, ఖాళీ స్థలాలు, రహదారుల వెంట చిన్న, పెద్ద, ఆడ, మగ తేడా లేకుండా వాకింగ్ చేస్తున్న వారి సంఖ్య రోజు రోజుకు పెరుగుతోంది.

● **ఉపయోగాలు:** నడక మన శరీర నిర్మాణాన్ని మార్చుతుంది. నడకతో చాలా రకాల ఉపయోగాలున్నాయి. గుండెజబ్బులు, మధుమేహం, మానసిక ఒత్తిడి, రక్తపోటు, స్థూలకాయం రాకుండా చూస్తుంది. శరీరంలోని కొవ్వును తగ్గించి జీవిత కాలాన్ని పెంచుతుంది. ఈ నేపథ్యంలో జిల్లాలోని ప్రధాన పట్టణాలతోపాటు పల్లెల్లో కూడా యువత, పెద్దలు నడకను జీవితంలో ఒక భాగంగా చేసుకుంటున్నారు. ప్రత్యేకించి ఇటీవలి కాలంలో 35 నుంచి 45 సంవత్సరాల మధ్య వయస్సు వారు, వృద్ధులు ఆసక్తి చూపుతున్నారు.

● **నేపథ్యం:** నడక ప్రాధాన్యాన్ని గుర్తిం చిన ప్రపంచ ఆరోగ్య సంస్థ 2002 మే 10న నిర్వహించిన సమావేశంలో వ్యాయామం, ఆరోగ్యం, ఆహారం అంశాల మీద చర్చించింది. ఆహార నియమాలతో పాటు నడక వ్యాయామాలపై ప్రజల్లో అవగాహన కల్పించడానికి ప్రతి సంవత్సరం మే 10న వరల్డ్ మూవ్ ఫర్ హెల్త్ డే జరుపుకోవాలని సూచించింది. అప్పటి నుంచి ప్రతి సంవత్సరం మే10న నడక దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.

వాకింగ్ ప్రారంభం ఇలా...

- వాకింగ్ ప్రారంభించే వారు మొదటి రోజు 5 నుంచి 15 నిమిషాలు నడిచి క్రమేపి సమయాన్ని పెంచాలి.
- షూస్ తప్పని సరిగా ధరించాలి.
- వీలైనంత వరకు ఉదయం, సాయంత్రం వాకింగ్ చేస్తే ఆరోగ్యానికి మంచిది.
- రహదారులపై వాకింగ్ చేయడం కంటే మైదానాలలోనే వాకింగ్ చేయడం మంచిది.



వాకింగ్ చేసేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- నడిచేటప్పుడు చేతులు ఊపుతూ శరీరాన్ని నిటారుగా ఉంచాలి.
- వాకింగ్ ఆపే ముందు వేగాన్ని క్రమేపి తగ్గించాలి.
- నడిచేటప్పుడు వదులుగా ఉండే దుస్తులనే ధరించాలి.
- ఆరోగ్య సమస్యలుంటే డాక్టర్ సలహాతో వాకింగ్ చేయాలి.
- ప్రతి రోజు 45 నిమిషాలు నడిస్తే మంచింది.
- పక్కవారితో సాధ్యమైనంత వరకు మాట్లాడకుండా ఉండాలి.
- నడిచేట ప్పుడు శ్వాసపై నియంత్రణ అవసరం.





నూతనోత్సాహం కలుగుతుంది..: ఎడ్ల మధు, వాకర్

వాకింగ్‌తో చేస్తే ఉత్సాహంగా ఉంటుంది. నడవని రోజు అసౌకర్యంగా ఉంటుంది. ఉదయమే ఏకాగ్రతతో నడవటం వల్ల ఇతర ఆలోచనలు దరి చేరవు. 10 సంవత్సరాలుగా క్రమం తప్పకుండా మైదానంలో వాకింగ్ చేస్తున్నాను.

బీపీ, షుగర్ నార్మల్‌గా ఉంటాయి.. :ఎంఏ కరీం, వాకర్



ఎనిమిదేళ్లుగా ప్రతి రోజు వాకింగ్ చేస్తున్నాను. గతంలో కాళ్ల, కీళ్లనొప్పులుండేవి. ప్రస్తుతం అవేమి లేవు. అనారోగ్య ఇబ్బందులు లేవు. షుగర్, బీపీ నార్మల్‌గా ఉన్నాయి.

ధర్మపురిలో వైభవంగా అన్నకూటోత్సవం

ధర్మపురి, మే 9 (ఆంధ్రజ్యోతి): నరసింహ నవరాత్రోత్సవాలను పురస్కరించుకుని ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీ నృసింహస్వామి ఆలయంలో అన్నకూటోత్సవం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ తదితర వేద మంత్రోచ్చరణల మధ్య ఆలయ ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి స్వామి వారలకు పురుషసూక్త, శ్రీసూక్త, కల్పోక్త, వ్యాసపూర్వక, శోడషోపచార పూజ, సహస్ర నామార్చన కార్యక్రమాలు నిర్వహించారు. పంచోపనిషత్తులచే మన్యసూక్త, రుద్రాభిషేకం, విశేష పూజలు, సప్తహారతులు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం పల్లవోత్సవం, వసంతోత్సవం కార్యక్రమంలో భాగంగా ప్రధాన ఆలయ మండపంలో అందంగా వివిధ రకాల చెట్ల కొమ్మలతో ప్రత్యేక వేదిక ఏర్పాటు చేశారు. అర్చకులు స్వామి వారల ఉత్సవ మూర్తులను ప్రత్యేక పీఠపైకి తీసుక వచ్చి ఆసీనులు చేశారు. అనంతరం పంచామృతాలు, వివిధ రకాల పండ్ల రసాలతో అభిషేకాది కార్యక్రమాలు జరిపి పల్లవోత్సవం, వసంతోత్సవం నిర్వ హించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారలను దర్శనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, వేదపారాయణదారు పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ, ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు పాల్గొన్నారు.



స్వామివారికి హారతి ఇస్తున్న అర్చకులు



నివేదన కోసం తీసుకు వెళుతున్న అర్చకులు

రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ

వేములవాడ కల్చరల్, మే 9 (ఆంధ్రజ్యోతి):వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలో శుక్రవారం భక్తుల రద్దీ నెలకొంది. ఇతర ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులు రాజన్న ఆలయంలోని ఆయా క్యూలైన్‌ల ద్వారా ఆలయంలోకి చేరుకుని శ్రీపార్వతి పరమేశ్వరులను దర్శించుకున్నారు. కోడె మొక్కులు చెల్లించుకున్నారు.



రాజన్న దర్శనం కోసం క్యూలైన్‌లో బారులు తీరిన భక్తులు

ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలి

- బీజేపీ ఆధ్వర్యంలో రాస్తారోకో



బీజేపీ నాయకులను ధర్నా విరమించాలని కోరుతున్న పోలీసులు

కోనరావుపేట, మే 9 (ఆంధ్రజ్యోతి) : కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని వెంటవెంటనే కొనుగోలు చేయాలని కోరుతూ భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో కోనరావుపేటలో రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు బాలాజీ మాట్లాడుతూ అకాల వర్షాల వల్ల ధాన్యం తడిసి ముద్దవుతుందని అన్నారు. అందుకే కొనుగోలు కేంద్రాల్లో వెంటనే కొనుగోళ్లు చేసి రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు గొట్టె రామచంద్రం, మాజీ జడ్పీటీసీ పల్లం అన్నపూర్ణ, వైస్ఎంపీపీ తీగల రవీందర్‌గౌడ్, మాజీ సర్పంచ్ అనుపాటి బాపురెడ్డి, జిన్నా అనిల్, బైరగోని సురేష్ గౌడ్, శంకర్, తిరుపతి, జితేందర్‌రెడ్డి, శ్రీనివాస్, మల్లేశం, విజయ్, శ్రీను, సుమన్, లక్ష్మారెడ్డి, దామోదర్ రెడ్డి, తీగల జయశ్రీ, విజయ్, రాజు, సాయి పాల్గొన్నారు.

హిందూ ఏక్తా యాత్రను విజయవంతం చేయాలి

చందుర్తి, మే 9 (ఆంధ్రజ్యోతి) : హిందూ ఏక్తా యాత్రను విజయవంతం చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అల్లాడి రమేష్ అన్నారు. కరీంనగర్‌లో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి, పార్లమెంట్ సభ్యులు బండి సంజయ్ కుమార్ నిర్వహిస్తున్న హిందూ ఏక్తా యాత్ర పోస్టర్‌ను మండల బీజేపీశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షుడు మొకిలే విజేందర్, నాయకులు మార్త సత్తయ్య, సిరికొండ శ్రీనివాస్, పొంచేటి రాకేష్, చిలుమాల హనుమయ్య చారి, మర్రి మల్లేశం, పత్తిపాక శ్రీనివాస్, చింతకుంట గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

2013 చట్టం ప్రకారం పరిహారం ఇవ్వాలి

- ప్రధాన రహదారి విస్తరణ నిర్వాసితుల డిమాండ్

వేములవాడ, మే 9 (ఆంధ్రజ్యోతి) : వేములవాడ పట్టణంలోని ప్రధాన రహదారి విస్తరణ కోసం సేకరిస్తున్న భూములు, భవనాలకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం నష్టపరిహారం చెల్లించాలని పలువురు నిర్వాసితులు కోరుతున్నారు. మూలవాగు వంతెన నుంచి రాజన్న ఆలయం వరకు గల రోడ్డును 80 అడుగుల మేరకు విస్తరించేందుకు ప్రభుత్వం సర్వే పూర్తి చేసిందని, సర్వేలో భూములు ఇళ్లు కోల్పోతున్న వారికి చెల్లించాల్సిన పరిహారం విషయంలో ప్రభుత్వ అధికారులు నిర్వాసితులతో చర్చలు జరపకుండానే ఏకపక్ష నిర్ణయం తీసుకోవడం బాధాకరమని పేర్కొంటున్నారు. పరిహారంలో ఏకపక్షంగా నిర్ణయం తీసుకుని నోటీసులు ఇవ్వడం సరికాదని, తాము అభివృద్ధిని వ్యతిరేకించడం లేదని, చట్ట ప్రకారం న్యాయంగా తమకు రావాల్సిన మేరకు తగిన పరిహారం ఇవ్వాలని వారు కోరుతున్నారు.

క్రీడాకారులకు ఉచితంగా పాలు పండ్ల పంపిణీ



చిన్నారులకు పాలు, పండ్లు అందజేస్తున్న నాయకులు

వేములవాడ, మే 9 (ఆంధ్రజ్యోతి) : వేములవాడ పట్టణంలోని బాలానగర్ మైదానంలో హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత క్రికెట్ శిక్షణ శిబిరంలో పాల్గొంటున్న క్రీడాకారులకు శుక్రవారం నాడు ఉచితంగా పాలు, పండ్లు అందజేశారు. దాదాపు 150 మంది క్రీడాకారులకు బీఆర్ఎస్ నాయకుడు పొలాస రాజేశం, ఈర్లపల్లి రాజు పాలు, పండ్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ నిమ్మశెట్టి విజయ్, క్రికెట్ క్రీడాకారులు పెద్ది రాజు, ప్రసాద్, నిఖిల్, శ్రీకాంత్ రెడ్డి, సతీష్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

పంపిణీ చేసిన భూములకు హద్దులు చూపండి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న అంబేద్కర్ సంఘ నాయకులు

ఇల్లంతకుంట, మే 9 (ఆంధ్రజ్యోతి) మండలంలోని పెద్దలింగాపూర్ గ్రామంలో ప్రభుత్వం దళితులకు పంపిణీ చేసిన భూములకు హద్దులు చూపాలని అంబేద్కర్ సంఘ నాయకులు కోరారు. దళిత సంఘ నాయకులు శుక్రవారం తహసీల్దార్ ఫైరూఖ్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతు 1978లో అప్పటి ప్రభుత్వం గ్రామంలో దళితులకు నివాస స్థలాలు కేటాయించిందన్నారు. భూసేకరణ చేసిన ప్రభుత్వం కొన్ని ప్లాట్లను పంపిణీ చేయకుండా విడిచిపెట్టారని పేర్కొన్నారు. అదే సర్వే నంబరులో ఉన్న రైతు ఈభూమి తనదే అని అంబేద్కర్ సంఘ సభ్యులకు నోటీసులు పంపించారని, రెవన్యూ అధికారులు మరోసారి సర్వే చేయాలని కోరారు. దళితులకు ఇంటి స్థలాల కోసం కేటాయించిన భూమిని ఆక్రమించాలని చూడటం అన్యాయం అన్నారు. కార్యక్రమంలో అంబేద్కర్ సంఘ అధ్యక్షుడు పసుల నరేష్‌కుమార్, సీనియర్ నాయకులు పసుల వెంకటి, గన్నేరం నర్సయ్య, సంఘ సభ్యులు అనీల్, సంజీత్, శ్రీనివాస్, అనీల్, లచ్చయ్య, మల్లేశం, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబానికి బియ్యం వితరణ

తంగళ్లపల్లి, మే 8 (ఆంధ్రజ్యోతి) : తంగళ్లపల్లి మండల కేంద్రానికి చెందిన బూడిద పద్మ అనే మహిళ అనారోగ్యంతో ఇటీవల మృతిచెందగా, ఆమె కుటుంబ సభ్యులను మాజీ జడ్పీటీసీ కోడి అంతయ్య పరామర్శించి 50 కేజీల బియ్యాన్ని అందించారు. అలాగే తంగళ్లపల్లికి చెందిన హేల్బుల కరుణ అనే మహిళ ఇటీవల గుండెపోటుతో మృతిచెందగా కుటుంబ బాధిత సభ్యులను పరామర్శించి మనోధైర్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో కడారి నవీన్‌రెడ్డి, బెంద్రం పవన్, బూర సాయి, దోర్నాల నవీన్‌రెడ్డి, రంగు మల్లేశం తదితరులు ఉన్నారు.

అనుమతులు లేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

సిరిసిల్ల రూరల్, మే 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అనుమతులు లేని ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లారపు ప్రశాంత్ డిమాండ్ చేశారు. సిరిసిల్ల పట్టణం బీవై నగర్‌లోని సీఐటీయూ అమృత్‌లాల్ శుక్లాకార్మిక భవనంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన సమావేశంలో ప్రశాంత్ మాట్లాడారు. జిల్లాలో ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు పుట్టగొడుగుల్లా పుట్టుక వస్తున్నాయన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి స్పందించి పర్మిషన్ లేని పాఠశాలలను మూసివేయాలని, అలాగే ఫీజుల నియంత్రణ చట్టం అమలుచేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు గుండెల్లి కళ్యాణ్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు జాలపల్లి మనోజ్‌కుమార్, జిల్లా కమిటీ సభ్యులు సాయి భరత్, శివ తదితులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్‌రూం ఇళ్ల పంపిణీ ఎప్పుడు?

- లబ్ధిదారులను ఎంపిక చేసి మూడేళ్లు.. - తొలగిన రోడ్డు ఇబ్బంది.. పంపిణీ చేయాలంటున్న లబ్ధిదారులు



ఇల్లంతకుంటలోని డబుల్ బెడ్‌రూం ఇళ్లు



డబుల్ బెడ్‌రూం ఇళ్ల వద్ద లబ్ధిదారులు(ఫైల్)

ఇల్లంతకుంట, మే 9 (ఆంధ్రజ్యోతి) : సొంతింటి కల నెరవేరుతుందని ఆశపడ్డ నిరుపేదలకు సంవత్సరాలుగా ఎదురుచూపులు తప్పడం లేదు. నిరుపేదల సొంతింటి కల సాకారం చేయాలనే లక్ష్యంతో గత ప్రభుత్వం మండలంలోని ఇల్లంతకుంట, పొత్తూరు, కందికట్కూర్, పెద్దలింగాపూర్, ఒబులాపూర్ గ్రామాలలో భూములను సేకరించి డబుల్ బెడ్‌రూం ఇళ్లను నిర్మించాలని నిధులు మంజూరు చేసింది. ఇల్లంతకుంటలో 40 డబుల్ బెడ్‌రూం ఇళ్ల స్థలానికి రోడ్డు సౌకర్యం లేకపోయినా ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. అనేక అవంతరాల మధ్య డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాలు పూర్తి అయ్యాయి. రోడ్డు సౌకర్యం లేదని అనేక రోజులు లబ్ధిదారుల ఎంపిక చేయలేదు. మండలంలోని మిగతా గ్రామాలలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను పంపిణీ చేసినా ఇల్లంతకుంటను పట్టించుకోలేదు. లబ్ధిదారుల ఎంపిక చేయాలని గ్రామస్థుల ఒత్తిడి మేరకు గ్రామసభల ద్వారా మూడు సంవత్సరాల క్రితం లబ్ధిదారులను ఎంపిక చేశారు. దీనితో తమ అద్దె కష్టాలు తీరుతాయని, త్వరలోనే కొత్త ఇంటిలోకి మారుతామని లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు. రోడ్డు సౌకర్యంతో పాటు మిగతా సౌకర్యాలు కల్పించిన అనంతరం కేటాయిస్తామని పేర్కొనడంతో లబ్ధిదారులు ఓపిక పట్టారు. డబుల్ బెడ్‌రూం ఇళ్లను ఎంతకూ కేటాయించకపోవడంతో విసుగు చెందిన లబ్ధిదారులు మార్చి నెలలో సామాన్లతో పాటు డబుల్ బెడ్‌రూం ఇళ్లలోకి ప్రవేశించి తమకు నచ్చిన గదికితాళాలు వేసుకొని వచ్చారు. ఇది తెలుసుకున్న అధికారులు వెంటనే పోలీసుల సహకారంతో లబ్ధిదారులను ఖాళీ చేయించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమకు ఇళ్లను కేటాయించాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

అద్దె ఇళ్లతో ఇబ్బంది పడుతున్నాం..

- కొండ్ల వెంకటరెడ్డి, ఇల్లంతకుంట



ప్రతినెల అద్దె కడుతూ ఇబ్బందిపడుతున్నాం. ఇల్లంతకుంటలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం పూర్తయిన తర్వాత పంపిణీ జరుగుతుందని సంతోషపడ్డాం. అన్ని వసతులు కల్పించిన తర్వాత పంపిణీ చేస్తామని అధికారులు చెబుతున్నారు. లబ్ధిదారుల ఎంపిక జరిగి సంవత్సరాలు గడిచిపోతున్నాయి. అనేక మంది అద్దెలు చెల్లించలేని పరిస్థితిలో ఉన్నారు. ఎమ్మెల్యే సత్యనారాయణ లబ్ధిదారులకు డబుల్ బెడ్‌రూం ఇళ్లను కేటాయించాలి.

వసతులు కల్పించాకే ఇళ్లను పంపిణీ చేస్తాం..

- ఫారూఖ్, తహసీల్దార్ ఇల్లంతకుంట



మండల కేంద్రంలోని డబుల్ బెడ్‌రూం ఇళ్ళలో కొన్ని వసతులు పూర్తి కానందున ఇంత వరకు ఎవరికీ అప్పగించలేదు. రైతుల సహకారంతో రోడ్డు సమస్య తొలగిపోయింది. మిగతా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకవెళ్లాం. ప్రతి గదికి రెవెన్యూ సిబ్బంది తాళం వేసి సీల్ వేశారు. డబుల్ బెడ్‌రూం ఇళ్ల వద్ద 163 సెక్షన్ అమలులో ఉంది. పంపిణీ చేయకముందు ఎవరు అందులోకి వెళ్లినా చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

తారు రోడ్డు నిర్మాణానికి మోక్షం

కోనరావుపేట, మే 9 (ఆంధ్రజ్యోతి) : ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న తారు రోడ్డు నిర్మాణానికి మోక్షం కలగడంతో మంగళపల్లివాసుల కల నెరవేరింది. కోనరావుపేట మండలం సుద్దాల ఎక్స్‌రోడ్డు నుంచి మంగళపల్లి నుంచి లింగంపల్లి హన్మాజిపేటకు వెళ్లే ప్రధాన రహదారి తారు రోడ్డు నిర్మాణం పనులు మూడు రోజుల క్రితం ప్రారంభమయ్యాయి. కంకర తేలి ఇబ్బందికరంగా మారిన రహదారిని మంగళపల్లివాసులు గత ప్రభుత్వానికి ఎన్నిసార్లు మొరపెట్టుకున్న నిధులు మంజూరు చేయకపోవడంతో గత పది సంవత్సరాలుగా కంకర తేలిన రోడ్డుపై వెళుతూ నరకయాతన పడ్డారు. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం, వేములవాడ ఎమ్మెల్యేగా గెలిచిన ఆది శ్రీనివాస్‌ను మంగళపల్లివాసులు కలిసి మొరపెట్టుకున్నారు. దీనికి స్పందించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చి రూ.కోటి 30లక్షలు మంజూరు చేశారు. కాగా మూడు రోజులుగా సదర్ కాంట్రాక్టర్ పనులు కొనసాగిస్తున్నారు.



సుద్దాల ఎక్స్‌రోడ్డు వద్ద నిర్మిస్తున్న సైడ్ వాల్స్

దీంతో మంగళపల్లి వాసులు ప్రభుత్వ విప్ శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలుపుతూ హర్షం వ్యక్తం చేశారు.

వీరజవానుకు ఘన నివాళి



ఎల్లారెడ్డిపేటలో నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు



సిరిసిల్లలో సంతాపం తెలుపుతున్న న్యాయవాదులు

ఎల్లారెడ్డిపేట, మే, 9 (ఆంధ్రజ్యోతి): దేశ రక్షణలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన మురళి నాయక్ అనే సైనికుడు ప్రాణాలు కోల్పోయి వీరమరణం పొందగా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, నాయకులు ఘన నివాళులు అర్పించారు. మురళి నాయక్ చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు, పీఏసీఎస్ చైర్మన్ గుండారాపు కృష్ణారెడ్డి, సెస్ డైరెక్టర్ వర్స కృష్ణహరి, నాయకులు పిల్లి కిషన్, బీమేష్, రాజునాయక్, నర్సింహులు, రాజిరెడ్డి, సుధాకర్‌రావు, సీత్యానాయక్, రాము, కళ్యాణ్, తదితరులు పాల్గొన్నారు.

● సిరిసిల్ల క్రైం, మే 9 (ఆంధ్రజ్యోతి) : ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా వీరోచితంగా పోరాడి వీరమరణం పొందిన ఆర్మీ వీరజవాన్ మురళినాయక్‌కు సిరిసిల్ల బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం న్యాయవాదులు సంతాపం తెలిపారు. బార్ అసోసియేషన్ హాలులో వీరజవాన్ మృతిపై న్యాయవాదులు రెండు నిముషాలు మౌనం పాటించి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు జూపల్లి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి తంగళ్లపల్లి వెంకటి, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

రుణాల పంపిణీ లక్ష్య సాధనకు కృషి : కలెక్టర్

సిరిసిల్ల కలెక్టరేట్, మే 9 (ఆంధ్రజ్యోతి): ఎస్‌హెచ్‌జీలకు బ్యాంక్ లింకేజీ రుణాల పంపిణీలో ఉత్తమ సేవలు అందించిన జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ బాధ్యులను కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అభినందించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరా మహిళా శక్తి లక్ష్య సాధ నలో భాగంగా ఎస్‌హెచ్‌జీలకు బ్యాంక్ లింకేజీ రుణాలు ఇప్పించిన జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారులు, సిబ్బందిని సమీకృత కార్యాలయాల సముదాయంలో శుక్రవారం కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అభినందించారు. అన్ని విభాగాల్లో ప్రథమ స్థానంలో ఉండేలా కృషి చేయాలని ఆకాంక్షించారు. అనంతరం కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ బ్యాంకు లింకేజి ద్వారా స్వశక్తి సంఘ సభ్యులకు రుణాలు ఇప్పించడంతో వారు ఆర్థికంగా ఎదుగుతున్నారని వివరించారు. జిల్లాలో బ్యాంకు లింకేజీ 2024-25 సంవత్సరానికి లక్ష్యం 7969 సంఘాలకు రూ. 533.73 కోట్లు కాగా 4376 సంఘాలకు రూ.542.30 కోట్లతో 102 శాతం ప్రగతి సాధించినందున, అలాగే ఫర్ గ్రూప్ ఫైనాన్స్ రూ.12.48లక్షలు ఇవ్వటంలో రాష్ట్రంలో ప్రథమ స్థానంలో ఉండటంతో రాష్ట్రస్థాయిలో జిల్లాకు అవార్డు వచ్చిందని తెలిపారు. పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి అనసూయ సీతక్క, ప్రిన్సిపల్ సెక్రెటరీ లోకేష్ కుమార్, సెర్ప్ సీఈవో దివ్య దేవరాజన్ నుంచి డీఆర్‌డీవో, అదనపు డిఆర్‌డీవో, డీపీఎం తదితరులు జిల్లా సమాఖ్య ప్రెసిడెంట్ సరిత స్వీకరించారని తెలిపారు. మహిళా సంఘాల బాధ్యులు జిల్లాలో బ్యాంకు లింకేజీ ద్వారా రుణం తీసుకుని నూనెమిల్లులు, బిర్యాని



అధికారులను అభినందిస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

పాయింట్స్, టిఫిన్ సెంటర్, పచ్చళ్ళు, మిల్లెట్స్‌పిండి, లడ్డు ఇతర పదార్థాలు, కిరాణం దుకాణాలు, బ్యూటీపార్లర్లు, సారీసెంటర్‌లు, జిరాక్స్ సెంటర్‌లు, క్యాంటీన్, ఈవెంట్ మేనేజ్‌మెంట్, డెయిరీ ఉత్పత్తులు, గేదెల పెంపకం వివిధ రకాల ఆదాయాభివృద్ధి కార్యక్రమాల ద్వారా ఆర్థిక ప్రగతి సాధిస్తూ ముందుకు సాగుతున్నారని తెలిపారు. పిల్లల ఉన్నత విద్యాభ్యాసానికి కూడా రుణాలు సద్వినియోగం చేసుకుంటున్నారని తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరం కూడా ఇందిరా మహిళా శక్తి లక్ష్యం 2025-26 సంవత్సరం డిసెంబర్ లోపు పూర్తిచేసి రాష్ట్రంలో జిల్లాని ప్రథమ స్థానంలో ఉంచాలని కలెక్టర్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీ ణ అభివృద్ధి సంస్థ అధికారి శేషాద్రి, అదనపు అధికారి శ్రీనివాస్, డీపీ ఎంలు, సీసీలు, జిల్లా సమాఖ్య బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

వానాకాలం 'సాగు' ఖరారు

(5వ పేజీ తరువాయి)

ఒక హెక్టార్‌కు రూ 4 లక్షలు ఇవ్వాలని నిర్ణయించారు. స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం బ్యాంకర్లు రుణ లక్ష్యాలను అధిగమించే ప్రయత్నం చేస్తున్న రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు.

పత్తికి విత్తన భారం...

పత్తిసాగు చేస్తున్న రైతులకు వానాకాలం సీజన్‌లో విత్తన భారం తప్పడంలేదు. ప్రతీయేటా విత్తన ధరలు పెరుగుతున్నా కేంద్రం ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం నుంచి సబ్సిడీ లేకపోవడంతో ప్రైవేటు విత్తన కంపెనీల విత్తనాలు కొనుగోలు చేయడం వల్ల పత్తి రైతులకు విత్తన మోత తప్పడం లేదు. తాజాగా 2025-26 సంవత్సరానికి బీటీ-2 పత్తి విత్తన 475 గ్రాముల ప్యాకెట్ ధరను రూ.901 నిర్ణయిస్తూ కేంద్ర వ్యవసాయ శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. గతేడాది పత్తి విత్తన ప్యాకెట్ ధర రూ.864 ఉండగా ఈసారి రూ.37 అదనంగా పెంచుతూ నిర్ణయించింది. దీంతో రాజన్న సిరిసిల్ల జిల్లా రైతులపై అదనంగా రూ.30 లక్షల వరకు భారం పడుతుంది. జిల్లాలో మిడ్‌మానేరు, మల్కపేట, అన్నపూర్ణ ప్రాజెక్టలతో పాటు ఎగువ మానేరు ప్రాజెక్టలోకి నీటిని నింపడం భూగర్భ జలాలు పెరిగి బోరుబావుల్లోనూ నీటి మట్టాలు వానాకాలం సీజన్‌లో పెరుగుతున్న క్రమంలో జిల్లాలో రైతులు వరి పత్తి సాగు వైపు మొగ్గు చూపుతున్నారు. గతంలో జిల్లాలో లక్షకు పైగా ఎకరాల్లో పత్తి సాగు జరిగేది. ప్రస్తుతం 49,760వేల ఎకరాల వరకు వానాకాలం సీజన్‌లో సాగుకు సిద్ధమయ్యారు. ఖరీఫ్‌లో రైతులు వరితో పాటు పత్తివైపు మొగ్గు చూపుతున్న క్రమంలో కేంద్ర ప్రభుత్వం విత్తన భారంవేసింది. గతేడాది పత్తి విత్తనాల ప్యాకెట్ రూ.864ఉండగా ప్రస్తుతం 901వరకు పెంచారు. ఒక ప్యాకెట్‌పై రూ.37 పెరిగింది. దీంతోపాటు ఎరువులు, మందులు, వ్యవసాయ కూలీల ధరలు రైతులకు మరింత భారాన్ని పెంచింది. ఈసారి రైతులు దాదాపు రూ.30లక్షల అదనపు భారాన్ని మోయాల్సి వస్తుంది. ప్రతియేటా విత్తనాల ధరలు పెరుగుతూనే ఉన్నాయి. పత్తి పండించే రైతులు ప్రైవేటులోనే విత్తనాఉల కొనుగోలు చేయాల్సి వస్తుంది. రైతులు ఎక్కువగా బీటీ 2 విత్తనాలనే వినియోగిస్తున్నారు. ఎకరానికి రెండు ప్యాకెట్లకు పైగానే ఉపయోగిస్తారు. మరోవైపు అనుకూల పరిస్థితులులేని పక్షంలో రెండవ సారి కూడా విత్తనాలు వేసుకునే పరిస్థితి ఉంటుంది.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

గంభీరావుపేట, మే 9 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండల కేంద్రంలో రూ 1.70 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు హమీద్ చేతుల మీదుగా అందజేశారు. అనారోగ్యంతో పలు ఆసుపత్రుల్లో చికిత్స పొందిన నరాణి మయూరి, బంగ్లా చంద్రకళ, టేకుమల్ల శంక్రీస్, కాశ లింగవ్వ, అఫ్షాబేగం, గుండేల్లి చంద్రకళకు ఈ సందర్భంగా సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. సీఎంఆర్ఎఫ్ చెక్కులు వచ్చేందుకు సహకరించిన మంత్రి పొన్నం ప్రభాకర్‌కు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, సిరిసిల్ల కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు హమీద్, సోషల్ మీడియా ఇన్‌చార్జి గౌరీశంకర్, ఏఎంసీ డైరెక్టర్ ఎడబోయిన ప్రభాకర్, మాజీ సర్పంచ్ అక్కపల్లి బాలయ్య, నాయకులు రాజశేఖర్, నాంపల్లి, జంగం రాజు, బండ్ల రాజు, ప్రసాద్, ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

కవి దేవనాందంకు సన్మానం



బూర దేవానందంను సన్మానిస్తున్న నిర్వాహకులు

సిరిసిల్ల, మే 9 (ఆంధ్రజ్యోతి): తెలుగు భాషా చైతన్య సమితి ఆధ్వర్యంలో హైదరాబాద్ త్యాగరాయ గానసభలో శుక్రవారం తెలుగు భాషకు పట్టాభిషేకం కార్యక్రమంలో భాగంగా సిరిసిల్లకు చెందిన ప్రముఖ కవి, సాహితీవేత్త బూర దేవానందంను ప్రశంసా పత్రంతో నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. దేవానందం తెలుగు భాష ఔన్నత్యంపై కవితాగానం చేశారు. అక్షరాలలో ముత్యాలు మెరిసెను... పలుకు పలుకులో తేనీయలు కురిసేను.. ఎంత చక్కని భాషా, నా మాతృభాష అంటూ కవితాగానం చేశారు. దేవానందంను సిరిసిల్ల మానేరు రచయితల సంఘం, జిల్లా రచయితల సంఘం, సిరిసిల్ల లసాహితీ సమితి కవులు, రచయితలు అభినందించారు.

చౌడాలమ్మను దర్శించుకున్న ప్రభుత్వ విప్



చౌడాలమ్మను దర్శించుకుంటున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ కల్చరల్, మే 9 (ఆంధ్రజ్యోతి): వేములవాడ మండలం సంకెపల్లి గ్రామంలోని చౌడాలమ్మ పట్నాలకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ శుక్రవారం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయానికి వచ్చిన ఆయనకు యాదవ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కాగా, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనర్సింహారావు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఏనుగు మనోహర్‌రెడ్డిలు హాజరై మొక్కులు చెల్లించుకున్నారు.

అనారోగ్యంతో ఒకరి మృతి

గంభీరావుపేట, మే 9 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండల కేంద్రానికి చెందిన డోలి రాజు(52)అనే వ్యక్తి శుక్రవారం అనారోగ్యంతో మృతిచెందాడని కుటుంబ సభ్యులు తెలిపారు. డోలి రాజు ఉదయాన్నే ఇంటినుంచి వెళ్లి రాత్రి అయినా తిరిగి రాలేదు. స్థానిక హనుమాన్ నగర్‌లో డోలి రాజు పడిపోయి ఉన్నాడని సమాచారం అందడంతో కుటుంబ సభ్యులు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు రాజు మృతిచెందాడని ధ్రువీకరించారు. రాజుకు బీపీ, షుగర్, గుండె సంబంధిత సమస్యలు ఉన్నాయని, బీపీ మాత్రలు వేసుకోలే దని కుటుంబ సభ్యులు తెలిపారు. కాగా, వడదెబ్బ తగిలి మృతిచెంది ఉండవచ్చని అనుమానం కూడా వ్యక్తం చేశారు. ఈ మేరకు కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతుడికి భార్య, కూతురు ఉన్నారు.

రాజన్న కోడెల మృతి



గోశాలలో మృతిచెందిన రాజన్న కోడె

వేములవాడ కల్చరల్, మే 9 (ఆంధ్రజ్యోతి) : వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారి ఆలయ గోశాలలోని రాజన్న కోడెలు ఎండ వేడికి తట్టుకోలేక మృత్యువాతపడ్డాయి. రాజన్న ఆలయ తిప్పాపూర్ గోశాలలో రెండు కోడెలు శుక్రవారం అస్వస్థకు గురై మృత్యువాత పడ్డాయి. వేసవి కాలం కావడంతో రాజన్న గోశాలలో రెండు కోడెలు మృతిచెందినట్లు తెలిసింది. సంబంధిత అధికారులు గుట్టు చప్పుడు కాకుండా కోడెలను ఖననం చేసినట్లు స్థానికులు తెలిపారు.